# పోస్టుమాన్

'పోస్టుమాన్" బయట కేక'!

కాంపౌండ్‌లో ఒకటే సంచలనం-సంరంభం-

'పోస్టుమాన్ - వచ్చాడోయ్ పోస్టుమాన్-ఏడీ పోస్టుమాన్?'

పక్కవాటాలో గురవయ్యగారి అరుపు 'యం. వో. వచ్చిందా?' మద్రాసు నుండి-నా పేరనే వచ్చివుండాలి-ఆ వెధవకు చెప్పాన్లే, మీ అమ్మ పేర చెయ్యవద్దురా బాబూ-పరశువాకం నుంచి నువ్వు చేసిన యం. వో. నేరుగా ప్రకాశ్ క్లాత్ స్టోర్‌లోకి పోతుందీ-అని-చూడవయ్యా నా పేరే వచ్చిందా? చూడూ! "అంటూ.

'పోస్టుమాన్ వచ్చాడా?' మధుమేహం కామాక్షయ్య. ఓపిక చేసుకొని లేని శక్తి కూడదీసుకొని మంచంమీది నుంచి లేచాడు-కూతురి పెళ్ళి సంబంధం కోసం పిడుగురాళ్ళలో వో బంధువుకు జాబు వ్రాశాడు. దానికి సమాధానం రావాలి ఇవ్వాళ న్యాయంగా అయితే!!

రోడ్డుమీద అదాలత్‌కు పోతున్న అబద్ధాల సత్యమూర్తి కారును ఆపి పోస్టుమాన్ వంక ఆశగా చూచాడు.

ఇవ్వాళ ఈ పోస్టులో వో లెటర్. రిజిష్టర్డ్ పోస్టులో రావాలి-అదే అందిందా ఇక చూస్కో-అవతలి పార్టీవాళ్ళు మన్ను కరిచారే అనుకో-

ఆ లెటర్ జడ్జిముందు పెడితే ఆయన చిత్తయిపోవాలి-ఉభయ ఖర్చులా అవతలవాడి నెత్తిన రుద్ది కేసు కొట్టివేయాలి-

ఇంతకూ ఆ లెటర్ వచ్చిందా రాలేదా?

డోలాయమాన స్థితిలో సత్యమూర్తి చూపులు.

ఎదురింటి ఆస్బెస్టాస్ రేకుల షెడ్‌లో కిరాయి కుంటున్న ఎల్. డి. సి.. యాదగిరి పోస్టుమాన్‌కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు ఉదయంనుండి.

మొన్న హైదరాబాదులో వో ఇంటర్వ్యూ కెళ్ళాడు యాదగిరి. వో మోస్తరు రికమెండేషన్ కూడా చేయించాడు ఉద్యోగానికి-

ఇవ్వాళ ఆర్డర్స్ రావాలి-లేదా తనకు జాబ్ రానట్లు ఆ ఆఫీసులో నేవున్న మిత్రుడు అగయ్య నుండి జాబైనా రావాలి.

యాదగిరి కళ్ళకు పోస్టుమాన్ దేవునిలా కన్పడ్డాడు. తెల్లవార్లూ నిద్ర లేకుండా చేసిన తపస్సుకు, పోస్టుమాన్ వరప్రసాదం చేసే ఉపాస్య దైవం అనిపించాడు.

నేనూ బయటకు వచ్చాను - గదికి తాళం పెట్టాను....

'నమస్తేసార్' పోస్టమాన్ నమస్కారం పెట్టాడు.

చిరునవ్వునే పలకరింపుగా విసిరి తాళంచెవి జేబులో వేసుకొని సైకిల్ తాళంచెవి చేతిలోకి తీసుకున్నాను.

'ఇదుగోసార్'

పోస్టమాన్ అందించిన 'అర్క' తీసుకున్నాను - పాండిచ్చేరీ అరవిందా శ్రమం వారి పత్రిక-

'యం. ఓ - వచ్చిందా' గురువయ్య రెట్టించి అడిగాడు మళ్ళీ

'లేదుసార్'-

గురవయ్య గుర్ గుర్ మన్నాడు-

'నా కేమన్నా ఉత్తరాలు-' కామాక్షయ్య వాక్యాన్ని సంపూర్తిగానే వుంచి 'లేదుసార్' అని జవాబిచ్చాడు పోస్టమాన్-

కామాక్షయ్యకు నడుములు విరిగినట్లనిపించింది.

సత్యమూర్తి రోడ్ మీదనుండి హారన్ వేశాడు - 'నా మాట ఏమిటన్నట్లు'

'ఉందిసార్ - వస్తున్నాను'

'పోస్టమాన్' యాదగిరి కేక-

పోస్టమాన్ లేదన్నట్లు ఈ కాంపౌండ్ లోనుంచే చేతిని ఊపాడు-

యాదగిరి నీళ్ళుగారిపోయాడు.

నేను సైకిలును గేటు బయటకు నడిపించాను.

పోస్టమాన్ కూడా రోడ్డుమీదికి వచ్చాడు-

కాంపౌండ్ లో తక్కిన వారందరి ముఖాలు వాడిపోయాయి-

గురవయ్య నిర్హేతుకంగా నావైపు కోపంగా చూస్తున్నాడు. తనకు యం. ఓ. రాలేదనీ, నాకు పోస్టుమాన్ ఏదో ఇచ్చివెళ్ళాడని ఆయన కోపం.

ఆయన, వరకువాకం యం ఓ.కూ నా పాండిచ్చేరి పత్రికకూ ఏమిటి సంబంధం?

నావైపు కోపంగా ఎందుకు చూడాలి?

పోస్టుమాన్ సత్యమూర్తి చేతికి లెటర్ అందించాడు.

సంతోషంగా అందుకొని చించాడు అక్కడే సత్యమూర్తి.

అది ఆయన ఎదురుచూచే లేఖ కాదు.

మొన్న కారు నిర్లక్ష్యంగా నడిపి ఆ లైసెన్సు కుక్కను చంపినందుకు గాను వో కుక్క యజమానులు సత్యమూర్తిపై పెట్టిన కేసుకు సంబంధించిన ఉత్తరం. (అలాగని తర్వాత తెలిసింది నాకు)

'బుద్ధిలేదా' అరిచాడు సత్యమూర్తి.

ఎవరికి బుద్ధిలేదు??

నడిపిన తనకా? చచ్చిన కుక్కకా? కేసు పెట్టినవారికా? ఉత్తరం తెచ్చి యిచ్చిన పోస్టుమాన్‌కా??

పోస్టుమాన్ సైకిలెక్కి కర్మయోగిలా పక్కసందులోకి దూసుకు పోయాడు.

అబద్దాల సత్యమూర్తి కారు అదాలత్‌కు నడిచింది.

కామాక్షయ్య మళ్ళీ కుక్కిమంచం చేరాడు.

ఎల్.డి.సి. నీరసంగా మళ్ళీ ఆఫీసు ముఖం పట్టాడు.

నా సైకిల్ యథాప్రకారం ఆఫీసువైపుకు.

ఇది ఇవ్వాళ ఒక్క రోజున జరిగిన విశేషం కాదు.

బాల సముద్రంలో నేను ఉండటం మొదలుపెట్టిన రెండేండ్లనుంచీ ఇదే వరస.

పోస్టుమాన్‌కోసం అలా వేయికళ్ళతో ఎదురుచూస్తారు, దేశముఖ్ కాంపౌండ్‌లో కిరాయికున్న వాళ్ళంతా.

చంద్రునికోసం చకోరంలా,

స్వాతి వానకోసం ముత్యపు చిప్పలా.

తొలకరికోసం చాతకంలా.

ప్రియునికోసం ప్రేయసిలా.

పోస్టుమాన్ హనుమకొండ పెద్ద పోస్టాఫీసునుండి మేఘునిలా బయలు దేరుతాడు ఎందరో యక్షులూ యక్షిణులూ పంపిన దౌత్యాలను వెంటబెట్టుకొని.

ఆయన సంచీనిండా సందేశాలే - ఉపదేశాలే - తిట్లే దీవెనలే!

పోస్టుమాన్ రాకకోసం ఇంద్రధనుస్సులా నిలుస్తుంది బాలసముద్రం, రకరకాల రంగుల ముఖాలతో.

పోస్టుమాన్ ఆయా సందేశాలనూ సమాచారాలనూ సమర్పించి పోతాడు.

కొన్ని ఉత్తరాలు ఇంటివాళ్ళను గొల్లున ఏడిపిస్తాయి.

మరికొన్ని కళ కళ లాడిస్తాయి.

వో జాబు చదివి 'చెలియా కనరావా?' అంటూ పగటి వెన్నెలలో విరహ గీతం ఆలాపిస్తాడొకడు.

వో ఉత్తరం చూచి పోస్టుమానినే చెంప పగలగొడదామని చెయ్యెత్తుతాడొక పెద్దమనిషి!

పోస్టుమాన్ కొందరికొకరోజు దేవునిలా అనిపిస్తాడు.

కొందరికి దయ్యంలా విషాదవార్తలు తెస్తాడు.

కొందరికి రజని

మరికొందరికి రాకాసుధాకరుడు.

నాకుమాత్రం పోస్టుమాన్ ఎప్పుడూ అద్దంలా కనిపిస్తాడు. మన మన ముఖాలను తనలో ప్రతిబింబింపజేస్తాడు. మన అదృష్టాలను విప్పి చెపుతుంటాడు.

మన కాళ్ళతో నడవలేని దూరాన్ని తాను వాహికగా నిలబడి నడిపిస్తాడు.

మనం కళ్ళతో చూడలేని విషయాలను తన అక్షర తూణీరాలనుండి మనకు చూపిస్తాడు.

ఆయన ఇచ్చిన ఉత్తరాలు చూచి మనం నవ్వుతూ, ఏడుస్తూవుంటే తానుమాత్రం కర్మసాక్షిలా తన పని చేసుకొంటూ వెళ్ళిపోతూవుంటాడు సూర్యునితో బాటు మండుటెండలో.

అందుకే పోస్టుమాన్ అంటే నాకేదో అభిమానం - ఆత్మబంధుత్వం!!

కాబట్టేనేమో, మా కాంపౌండ్‌లో మిగిలినవారు చెయ్యని వో చిన్న పని నేను చేస్తూవుంటాను.

అదేమంటే నాకెప్పుడైనా, యం ఓ. వచ్చినా, శుభవార్త తెచ్చినా, పావలాకాని ఇరవై పైసల బిళ్ళకాని ఇస్తూవుంటాను పోస్టుమాన్‌కు ఆయన అడగకుండానే. ఆ పావలాకే పోస్టుమాన్ కృతజ్ఞత ప్రదర్శిస్తాడు.

సంతోషంతో వెళ్ళిపోతాడు.

దానితో ప్రతిరోజూ నాకేదో సంతోషకరమైన వార్తనే తెచ్చి ఇవ్వాలనే కోరిక ఆయనలో ప్రబలుతూ వున్నదేమోనని నేను ఆయన ముఖం చూచినప్పుడల్లా భావించేవాణ్ణి - అది నిజమైనా అబద్ధమైనా.

అయితే పోస్టుమాన్ నా స్వల్ప పారితోషికం కోసమే చిరునవ్వులనో కృతజ్ఞతలనో ఒలకబోసే రకం మనిషి కాదని త్వరలోనే తేలిపోయింది.

ఒకనాడు గురవయ్యకు యం ఒ. వచ్చింది. సమయానికి గురవయ్య ఇంట్లోలేడు - భార్య వుండి యం. ఓ ఇమ్మన్నది.

'వీలులేదమ్మా - అది వారికే ఇవ్వాలి'

ఆదిలక్ష్మికి పోస్టమాన్‌మీద బాగా కోపంవచ్చింది.

'ఆయన ఇంట్లో లేనప్పుడు సంతకంచేసి తీసుకొనేటట్లు కాగితం వ్రాసి మీ పోస్టమాష్టరు కిచ్చాడుగా.'

'కావచ్చునమ్మగారూ - కాని నిన్న గురవయ్యగారు కనపడి, 'ఇదుగో షాబుద్దీన్! యం ఓ. మాత్రం మా ఆవిడకు ఇవ్వకేం, అని చెప్పారండీ - అందు కని ఇవ్వపడదు.'

ఆదిలక్ష్మి అభిమానం దెబ్బతింది.

'నీవుచేసేది పోస్టజవానుపనా? కలక్టరీపనా? వెధవ పెదసరమూ నీవూనూ - రిజిష్టర్డు ఉత్తరాల దగ్గరనుండి అన్నీ నాకు ఇవ్వవచ్చునని ఆయన కాగితం వ్రాసి ఇస్తే ఇక వద్దనేందుకు నీకేమిటి ఆయనకే అధికారంలేదు తెలుసా?' అన్నది.

ఆదిలక్ష్మి వాదన చాలా బలమైనదేనని నేను గ్రహించాను - కాని పోస్ట మాన్ ఇవ్వడానికి తిరస్కరించాడు. 'లీగల్‌గా మీది రైటే కాని ఈ విషయంలో మోరల్‌గా మీకు ఇవ్వడానికి వీలుపడదండి - గురవయ్యగారే స్వయంగా ఇవ్వ వద్దని నిన్నచెపితే ఎలా ఇస్తాను? మనిషి మాటకంటే ఆయన వ్రాసిన కాగితం గొప్పదా?'

షాబుద్దీన్ మాటలతో ఆదిలక్ష్మికి తిక్కరేగుకొచ్చి తిట్టడం మొదలు పెట్టింది - 'ఆ ముష్టి పావలాపైసలూ మొఖాన పడేస్తాను ఇవ్వ'మంది.

ఇవ్వలేదు - పోస్టమాన్!

మా భార్యాభర్తల మధ్య వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకొనే అధి కారం నీ కెక్కడిదని గద్దించింది.

షాబుద్దీన్ కిమ్మనలేదు.

'నీ వెర్రి వ్యవహారానికి నిన్ను కోర్టుకీడుస్తా-మీ పోస్టమాస్టరుకు రిపోర్టు చేస్తా' నన్నది.

పోస్టమాన్ భయపడలేదు-

కేవలం ఉత్తరం ఒకటి మాత్రం ఆమెకిచ్చి సైకిలును కాంపౌండ్ నుంచి బయటకు మళ్ళించాడు.

ఆ జాబులో ఆదిలక్ష్మి తమ్ముడికి ఆక్సిడెంట్ అయినట్లు వార్త వుంది. వెంటనే ఆమె ఏడుపుకు లంకించుకొంది. అలాంటి అశుభవార్త తెచ్చిన షాబుద్దీనును తిట్టడం మొదలుపెట్టింది- కేవలం అశుభవార్తే కాక యం. ఒ. ఇవ్వనన్న కోపం కూడా పరోక్షంగా ఈ తిట్లకు కారణ మయింది.

షాబుద్దీన్ జాబులన్నీ డెలివరీ చేసి తిరుగురవుండ్‌లో మళ్ళీ వచ్చాడు-ఆదిలక్ష్మిగారిని పలకరించి తానే ఆమె దుఃఖంలో భాగం పంచుకున్నాడు-అప్పటికి గురవయ్య కూడా తిరిగివచ్చాడు. ఆయనకు ఎం. ఓ ఇచ్చి వెళ్ళిపోయాడు.

దానినిబట్టి షాబుద్దీన్ కేవలం పోస్టుజవానే కాక, ఒక ఆత్మబంధువులా, తాను తెచ్చిన వార్తలతోబాటు ఆ వార్తలు చదివినవారి సుఖదుఃఖాలలో కూడా భాగం పంచుకుంటున్నాడని నాకనిపించింది.

ఎందుకో ఒకసారి అనుకున్నాను-అతనితో స్నేహం చేయాలని-

కేవలం ఒక్క క్షణకాలం మాత్రం వచ్చిన అనుభావం అది.

అందుకనే స్థాయికి చేరుకోలేదు-

షాబుద్దీనుతో స్నేహం చేసే తీరికా నాకు దొరకలేదు.

అలా కొంతకాలం గడిచింది-

పెళ్ళిచూపులకు రావలసిందని మా నాన్న వ్రాసిన జాబును షాబుద్దీన్, తెచ్చి ఇచ్చాడు-

వెళ్ళి వచ్చాను-

ఆ తర్వాత పెళ్ళికి ముహూర్తం పెట్టినట్లు వచ్చిన జాబునూ అందించాడు-

కొంత కాలానికి పండగకు అత్తగారింటికి రావలసినదిగా మామగారు వ్రాసిన జాబునూ ఇచ్చాడు.

కొన్నాళ్ళకు 'అమ్మాయి సీమంతానికి' రమ్మని అతగాడే వ్రాయించిన జాబునూ ఇచ్చాడు.

'రాత్రి రెండు గంటలకు కుమారుడు కలిగాడన్న' జాబూ వచ్చింది.

ఇరవై ఒకటోరోజు లోపలే మామగారు పోయారన్న వార్తా మోసుకొచ్చాడు.

పరుగెత్తే కాలం సృష్టించే వార్తలన్నిటినీ షాబుద్దీన్ దేవదూతలా అంద జేశాడు సకాలంలో. పరశువాకంలోని కొడుకు పెళ్ళయినాక, ఇక పంపలేనని వ్రాసిన జాబునూ గురవయ్యగారికిచ్చాడు. కొంతకాలానికి, 'పిల్లను చేసుకోవ డానికి పిల్లవాడు అంగీకరించాడన్న' వార్తనూ మధుమేహం కామాక్షయ్యగారికి అందజేశాడు. యాదగిరికి విజయవాడ సిమెంట్ కంపెనీలో ఉద్యోగం వచ్చిం దన్న వార్తను తెచ్చిఇచ్చాడు.

యాదగిరి గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడు.

పనివాడితోసహా మా ఆవిడ తిరిగివచ్చింది. గురవయ్య గుండెజబ్బువల్ల ఆదిలక్ష్మితోసహా మద్రాసు చేరాడు.

మా కాంపౌండ్‌లో వోనర్ మరో రెండు పోర్షన్లు కట్టించి రెండు కుటుంబా లకు కిరాయికిచ్చాడు.

ముందొక మడిగీ (దుకాణం) కట్టించి అద్దెకిచ్చాడు.

ఇన్ని మార్పులూ ఇన్ని చేర్పులూ జరిగినా షాబుద్దీన్‌లో మాత్రం ఏమీ మార్పూ చేర్పూ లేదు. వానాకాలంలో పిడుగులు రాలినా, ఎండాకాలంలో నిప్పులు కురిసినా సైకిల్ మీద సంచీనిండా షాబుద్దీన్ అలా వార్తలను మోసుకొనే వస్తున్నాడు.

సందేశాలనన్నీ గుమ్మంగుమ్మానికీ అందించి అలా వెళుతూనే ఉన్నాడు.

ఇలా వుండగా, ఆనాడు, రేషన్ దుకాణంలో చక్కెర ఇస్తున్నారు కార్డులమీద, అంటే నేను సైకిల్‌పై బయలుదేరాను సుబేదారికి.

షాబుద్దీన్ చిన్న కిరోసిన్ టిన్ పట్టుకొని క్యూలో నిలబడ్డాడు అక్కడే!

నన్ను చూచి నమస్కరించాడు.

నేను చిరునవ్వుతోనే విష్ చేశాను.

తన స్థానంలో డబ్బాను మనిషికి బదులుగా పెట్టి నాదగ్గరికి వచ్చాడు.

'మామగారి సంవత్సరీకాలకు రేపు వెళ్తారుకదా, జాబులు కిటికీలోగుండా వేసి పొమ్మంటారా లేకరి డైరెక్టు చెయ్యమంటారా? సార్'

'అక్కర్లేదు-కిటికీలోగుండానే పడేసిపో' అంటూనే ఈ సంవత్సరీకాలు షాబుద్దీనుకు ఇంత జ్ఞాపకం ఎలా వున్నయ్యో అని ఆశ్చర్యపోయాను.

ఏడాది అయింది ఆయన పోయినాడన్న జాబు తెచ్చి ఇచ్చి.ఆ తేదీ గుర్తు పెట్టుకున్నాడా? లేక మా ఆవిడ ఏమైనా అన్నదా, మేము వూరికి వెళ్తున్నామని 'షాబుద్దీన్'

'సార్-,

'నీనిక్కడ కుటుంబంతోనే వుంటున్నావా?'

'లేదు సార్-ఒక్కణ్ణే.'

'ఏం ఫామిలీ వూరికి పోయిందా?'

'నాకసలు పెళ్లె కాలేదుసార్.'

'ఏం?'

'అదో పెద్ద కథ సార్-ఇలా టూకీగా చెప్పేదికాదు-నేనొక బంధువుల పిల్లను చేసుకోవాలనుకున్నాను. కాని నాకు పైస లేదని వాళ్లు వేరేవాళ్ళకి ఇచ్చిండ్రు సార్'

'తర్వాత.'

'తర్వాత .. ఇక నాకు చేసుకోబుద్ధి పుట్టలేదు-అంతే-అప్పటికీ ఇప్పటికీ'

'మరి మీ అమ్మా నాన్న-'

'మా అమ్మ చిన్నతనంలో పోయింది-మా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. నాకు నావాళ్లెవరూ జాబు వ్రాయరు సార్'

నివ్వెరపోయాను నేను-

'షాబుద్దీన్! వేరే బంధువులు నీకు-'

'మీరే సార్-మీరంతా అన్నయ్యలూ, అమ్మగార్లంతా అక్కయ్యలూ కారా-'

'షాబుద్దీన్! ఇదర్ ఆరే' క్యూలోవాళ్ళు కేకపెడుతున్నారు-

చిరునవ్వుతో షాబుద్దీను మళ్ళీ క్యూలో ప్రవేశించాడు.

నాకు చక్కెర దొరికింది.

కాని, తల ఏమిటో బరువెక్కింది-

షాబుద్దీనుకు తల్లీ తండ్రీ, అన్నా తమ్ముడూ, భార్యాబిడ్డలూ, ఎవరూ లేరు-

షాబుద్దీనుకు ఎవరూ జాబులు వ్రాయరు.

రోజూ వందలాది వార్తలు వేలాదిమైళ్ళ దూరం నుంచి మోసుకొనివచ్చే షాబుద్దీనుకు ఎవరూ వార్తలు పంపరు. ఏ వార్త కోసమూ షాబుద్దీను గుమ్మం దగ్గర ఎదురు చూడడు. అతనికి మాత్రం మమతలూ మమకారాలూ ఉండవా??? జాబులు అందుకోవాలనో, వ్రాయాలనో కోరిక వుండదా???

సైకిల్ ఇంటికి చేరింది

భావలహరి నుండి బయటబడ్డాను-

చక్కెరలేక నిన్నతాగిన "బ్లాక్ కాఫీ" కన్నా ఇవ్వాల్టి పంచదార కాఫీ మరింత చేదుగా అనిపించింది నాకెందుకనో.

'షాబుద్దీనును పెళ్ళిచేసుకోమని చెప్పాలి రేపు' అనుకుంటూ పడుకున్నాను రాత్రి-

మెల్లగా నిద్ర-అందులో ఓక కల-

'మీ ఆవిడ ప్రసవించిందని' షాబుద్దీనుకు ఒక లేఖ కిటికీలోగుండా పోస్ట్ మాన్ వేసిపోయాడట-!

బంధువులందరూ శుభాకాంక్షలూ, క్షేమసమాచారాలూ, తెలుపుతూ లేఖలు షాబుద్దీనుకు వ్రాస్తున్నారట.

ఉత్తరాలన్నీ హంసల్లా ఎగురుకుంటూ షాబుద్దీను కిటికీలోంచి ఇంట్లోకి దూకుతున్నయట-

ఉత్తరాలతో అతని గది మొత్తం నిండిపోయిందట!!

మెలకువ వచ్చింది ఎందుకో!!

లేచను.

ఇంకా తెల్లవారలేదు-

షాబుద్దీను పెళ్ళికల చెదిరిపోయింది-

ఉదయం నాకు రావలసిన అరియర్స్ చెక్ తెస్తాడో? లేదో పోస్టుమాన్ అన్న భావం మాత్రమే స్పురించింది ఒక్కసారి, ఆ తెల్లవారబోయేముందు.